Happy Work Anniversary. 1st Year

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers

సంపుటి : 2 సంచిక : 324 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 21 నవంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 324 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 21 November 2025 PAGES : 8 PRICE : 3/-

## ఇంకా కాంగ్రెస్‌లోనే ఎందుకున్నారు? శశి థరూర్‌పై కాంగ్రెస్ నేత ఫైర్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 20)
ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ప్రశంసిస్తూ కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు మరోసారి సొంత పార్టీ నేతలకు ఆగ్రహం తెప్పించాయి. దీనిపై తాజాగా కాంగ్రెస్ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ తీవ్రంగా స్పందించారు. భాజపా సిద్ధాంతాలు నచ్చితే ఇంకా కాంగ్రెస్‌లోనే ఎందుకు కొనసాగుతున్నారని థరూర్‌ను ఆయన ప్రశ్నించారు."శశి థరూర్ సమస్య ఏంటంటే.. ఆయనకు ఈ దేశం గురించి పెద్దగా తెలియదు. కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా దేశానికి ఎవరైనా మంచి చేస్తున్నారని మీరు (థరూర్‌ను ఉద్దేశిస్తూ) అనుకుంటే.. అప్పుడు మీరు కూడా వారి సిద్ధాంతాలనే అనుసరించండి. ఇంకా ఎందుకు కాంగ్రెస్‌లోనే ఉన్నారు? ఈ పార్టీ నుంచి మీరు ఎంపీ కావడం వల్లేనా?" అని సందీప్ దీక్షిత్ నిలదీశారు. కాంగ్రెస్ కంటే భాజపా, మోదీ వ్యూహాలు బాగున్నాయని భావిస్తే అందుకు తగిన ఆధారాలతో వివరణ ఇవ్వాలని థరూర్‌కు సూచించారు. అలా చేయడం లేదంటే ఆయన మోసపూరితంగా వ్యవహరిస్తున్నారనే అర్థం అంటూ ఎంపీపై విరుచుకుపడ్డారు.ఇటీవల ఓ ప్రైవేటు కార్యక్రమంలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగానికి కితాబిస్తూ థరూర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. "అభివృద్ధి కోసం భారత్ ఎంత తపనపడాలో, బ్రిటీషు కాలం నాటి మనస్తత్వాన్ని ఎలా వీడాలో ప్రధాని మోదీ తన ప్రసంగంలో తెలిపారు. ప్రపంచానికి భారత్ కేవలం 'అభివృద్ధి చెందుతున్న మార్కెట్' మాత్రమే కాదని, 'అభివృద్ధికి మోడల్' అని ప్రధాని అన్నారు. ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లో ఉంటానని తనను అందరూ ఆరోపిస్తుంటారని మోదీ చెప్పారు. కానీ ఆయన ప్రజల సమస్యల విషయంలో ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారు" అని థరూర్ ప్రశంసించారు. దీనిపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు.

## కోర్టుకు హాజరవుతూ జగన్ బలప్రదర్శన సిగ్గుచేటు: మంత్రి కొల్లు రవీంద్ర



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 20)
న్యాయ వ్యవస్థను హేళన చేసేలా హైదరాబాద్‌లో జగన్ వైఖరి ఉందని మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 సీబీఐ ఛార్జి షీట్లు, 9 ఈడీ ఛార్జిషీట్లలో జగన్ రెడ్డి ఏ1 అని, ఇంతటి తీవ్రమైన ఆర్థిక నేరాల్లో ఉండి కూడా కోర్టులకు హాజరవ్వకుండా డ్రామాలాడారని మండిపడ్డారు. సుమారు రూ.43 వేల కోట్ల అవినీతిని దర్యాప్తు సంస్థలు నిర్ధరించాయని గుర్తుచేశారు. అలాంటి జగన్ రెడ్డి ఇవాళ.. కోర్టుకు -మిగతా 2లో

## అక్రమాస్తుల కేసులో జగన్ జైలుకు వెళ్లడం ఖాయం: మంత్రి సత్యకుమార్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 20)
అక్రమాస్తుల కేసులో వైకాపా అధినేత జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆరేళ్ల తర్వాత తప్పని పరిస్థితుల్లో విచారణ నిమిత్తం కోర్టుకు వెళ్తూ.. కార్యకర్తలతో బల ప్రదర్శనకు దిగడం.. జగన్ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. తాను కోర్టుకు హాజరైతే సమస్యలు ఎదురవుతాయని కోర్టును నమ్మబలికే ప్రయత్నంలో భాగంగానే -మిగతా 2లో

# ఈ నెల 24 నుంచి రైతన్నా

## మీకోసం 10 వేలమందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**వ్యవసాయంలో పంచ సూత్రాలపై ఏడు రోజులపాటు కార్యక్రమాలు**
**అగ్రిటెక్‌పై రైతుల్లో చైతన్యం తీసుకువద్దామని పిలుపు**
**వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు**




(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 20)
వ్యవసాయ రంగంలో సమూల మార్పుల ద్వారా సాగును లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి కార్యక్రమాలు చేపట్టనుంది. 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి రైతు ఇంటికి వెళ్లనున్నారు. డిసెంబర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొననున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సహా 10 వేల మందితో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాతల సంక్షేమం కోసం, సాగు విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై ముఖ్యమంత్రి ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై టెలీకాన్ఫరెన్స్‌లో ఆయా శాఖలకు దిశానిర్దేశం చేశారు.ఈ మేరకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించారు. -మిగతా 2లో

## విద్యార్థుల చేతిలోనే భవిష్యత్తు, కష్టపడితేనే విజయం మీ సొంతం: నారా భువనేశ్వరి

**విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చన్న నారా భువనేశ్వరి**




(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 20)
క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విజయం మన సొంతమవుతుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర కీలకమైందని, చిన్నతనం నుంచే పిల్లలకు విలువలు నేర్పించాలని అన్నారు. 2వ రోజు కుప్పం నియోజక వర్గం పర్యటనలో భాగంగా పరమ సముద్రం గ్రామంలో నారా భువనేశ్వరి పర్యటించారు.కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గురుకుల పాఠశాలలను సందర్శించారు. కేజీబీవీ నుంచి గురుకుల పాఠశాలకు విద్యార్థులతో కలిసి ఆటోలో ప్రయాణించారు. అనంతరం సామగుట్టపల్లిలో విలువల బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారితో -మిగతా 2లో

## అమరావతి రైతుల సమస్యల పరిష్కారంపై ఏపీ ప్రభుత్వం దృష్టి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 20)
రాజధాని అమరావతి రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. తమకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్‌లలో వేసిన సరిహద్దు రాళ్లు వివిధ కారణాలతో తొలగిపోయినట్లు మంత్రి నారాయణ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. ఈ మేరకు మంత్రి ఆదేశాలతో డిసెంబర్ 15 నుంచి హద్దు రాళ్లు లేని ప్లాట్లకు పెగ్‌మార్క్ వేసి హద్దు రాళ్లు వేయాలని సీఆర్డీయే నిర్ణయించింది. మూడు నెలల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించింది.

## బాలకృష్ణకు అరుదైన గౌరవం.. 'ఇఫి' వేడుకలో సన్మానం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 20)
ప్రముఖ నటుడు బాలకృష్ణ కు మరో అరుదైన గౌరవం దక్కింది. గోవా వేదికగా గురువారం ఘనంగా ప్రారంభమైన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' వేడుకలో ఆయన్ను సన్మానించారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ , గోవా సీఎం ప్రమోద్ సావంత్ శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. నటుడిగా 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా బాలకృష్ణకు ఈ గౌరవం దక్కింది. ప్రారంభ వేడుకకు నటుడు అనుపమ్ ఖేర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 28 వరకూ ఈవెంట్ కొనసాగనుంది. ముగింపు వేడుకలో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు. ఆయనదీ 50 ఏళ్ల నట ప్రస్థానం.సన్మానం అనంతరం బాలకృష్ణ మాట్లాడారు. తన ప్రయాణంలో భాగమైన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. "ఎన్టీఆర్- బసవతారకం దంపతులకు జన్మించడం నా అదృష్టం. నా ప్రయాణంలో భార్య వసుంధర సపోర్ట్ చాలా ఉంది" అని పేర్కొన్నారు. సినిమాల్లోకి వచ్చి 50 ఏళ్లు అని, అసలు వయసు అడగొద్దు అంటూ నవ్వులు పూయించారు. నట ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఎన్టీఆర్ నట, రాజకీయ జీవితం, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నెలకొల్పడానికి గల కారణాన్ని గుర్తుచేసుకున్నారు.

## ఎకరాతో సేంద్రియ సాగు ప్రారంభించండి

ఏటేటా దాని విస్తీర్ణం పెంచండి
కోయంబత్తూరు సదస్సులో ప్రధాని మోదీ
రూ.18 వేల కోట్ల పీఎం కిసాన్ నిధుల విడుదల



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 20)
'ఒక సీజన్‌లో ఎకరాతో సేంద్రియ వ్యవసాయాన్ని మొదలుపెట్టండి. తర్వాత ఏటేటా దాన్ని కొద్దికొద్దిగా పెంచుకుంటూ వెళ్లండి. భవిష్యత్తులో ఇది పెద్ద విప్లవాన్ని తీసుకురానుంది' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో 'దక్షిణభారత సేంద్రియ వ్యవసాయ సదస్సు-2025'ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 9కోట్ల మంది రైతులకు 21వ విడత పీఎం కిసాన్ నిధులు రూ.18వేల కోట్లను విడుదల చేసి, సభలో ప్రసంగించారు. "ఈ సదస్సుకు వచ్చిన రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని చిరుధాన్యాల(శ్రీఅన్న) సాగులో అన్వయించాలి. ఇలా చేస్తే భూమికి మంచిది. ఈ వ్యవసాయంలో ప్రపంచలీడర్‌గా -మిగతా 2లో

## అక్రమాస్తుల కేసు.. సీబీఐ కోర్టులో విచారణకు హాజరైన జగన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 20)
అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు.

# ఈ నెల 24 నుంచి రైతన్నా

## మీకోసం 10 వేలమందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈ కార్యక్రమానికి 'మీకోసం రైతన్నా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించనున్నారు.

ఈ సందర్భంగా టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ "గత 7 నెలలుగా రైతులను, వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్తున్నాం. ఇప్పటికే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద దాదాపు 46.50 లక్షల మందికి పైగా రైతులకు రెండు విడతలుగా రూ.14 వేలు జమ చేశాం. రెండు విడతల్లో కలిపి రూ.6,310 కోట్లు రైతులకు చెల్లించాం. బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.

పొలం పిలుస్తోంది కార్యక్రమం కూడా చేపట్టాం. ఇలాంటి వాటితో పాటు వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను ప్రకటించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్ధతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టాం. ఈ పంచసూత్రాలను ప్రతి రైతుకే కాకుండా రైతు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలి. రైతులతో పాటు పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం దారులు, ఆక్వా, ఉద్యాన, సెరీ కల్చర్ రైతులకూ అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ముందుండి చేపట్టాలి. దీంతో పాటు వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించాలి. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో యాక్షన్ ప్లాన్ చేయాలి" అని పేర్కొన్నారు.

**ప్రకృతి సేద్యం: అగ్రిటెక్ విధానాలతో కలిగే లాభాలు వివరించాలి**

రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని అన్నారు. శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుందని, ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికే ఆయా ఉత్పత్తులకు సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ చేస్తున్నామని, రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించాలని అన్నారు.

కడపలో ప్రకృతి సాగును కూడా పరిశీలించానని, ఆ సాగు రైతులు చాలా సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాల కంటే గ్రోమోర్ కేంద్రాల్లోని ఎరువుల ధర తక్కువగా ఉందని అన్నారు."రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. రైతుల ఏ పంటలు సాగు చేశారు, వారికి ఎటువంటి సాయం కావాలనేది నేరుగా తెలుసుకోవాలి. సాగులో పురుగుమందుల వినియోగం వల్ల జరిగే నష్టాలను రైతులకు స్పష్టంగా అర్థమయ్యేలా వివరించాలి. దీంతో పాటు తక్కువ వినియోగం వల్ల కలిగే లాభాలను, సేంద్రీయ సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఏ స్థాయిలో ఉందనేది వివరించాలి. పూర్తి వాటర్ మేనేజ్మెంట్ ద్వారా రిజర్వాయర్లను నింపగలిగాం. అలాగే సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న

## మొదటి పేజీ తరువాయి

మద్దతు వంటి విషయాలను రైతులకు చెప్పాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోర్టుకు హాజరవుతూ జగన్ బలప్రదర్శన సిగ్గుచేటు: మంత్రి కొల్లు రవీంద్ర

హాజరవుతూ బలప్రదర్శన చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. భారీ ఊరేగింపులు, ర్యాలీలతో కోర్టుకు హాజరవ్వడం న్యాయస్థానాలను అవమానించడమేనని పేర్కొన్నారు. రప్పా రప్పా అంటూ బ్యానర్లతో ర్యాలీ చేయడం జగన్ రెడ్డి నేర మనస్థత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. క్విడ్ ప్రోకో, షెల్ కంపెనీలతో ప్రజల ఆస్తుల్ని కొల్లగొట్టిన జగన్ రెడ్డి లాంటి క్రిమినల్ వెనుక నడిచే వారు ఆలోచించుకోవాలని హితవు పలికారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు.

# అక్రమాస్తుల కేసులో జగన్ జైలుకు వెళ్లడం ఖాయం: మంత్రి సత్యకుమార్

హైదరాబాద్‌లో నానా హంగామా సృష్టించారని మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. ప్రజాబలం ఉందని చెప్పుకోవడానికి ముందస్తు పకడ్బందీ ప్రణాళికతోనే పెయిడ్ ఆర్టిస్టులతో ర్యాలీ నిర్వహించి.. హైదరాబాద్ వాసులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. విచారణలో భాగంగా కోర్టులకు హాజరయ్యేవారు వినయంగా వ్యవహరిస్తారని...జగల్ ఎటువంటి పశ్చాత్తాపం కనిపించడం లేదన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ. వేల కోట్ల అక్రమ ఆస్తులు అర్జించిన జగన్.. కోర్టు కేసుల నుంచి తప్పించుకుని ఎంతోకాలం బయట తిరగలేరని వ్యాఖ్యానించారు.

# విద్యార్థుల చేతిలోనే భవిష్యత్తు, కష్టపడితేనే విజయం మీ సొంతం: నారా భువనేశ్వరి

కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడారు.

**విజయానికి షార్ట్ కట్ లేదు :** "పిల్లల భవిష్యత్ బాగుండాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మీపై ఉంది. ఆటపాటతో పాటు కెరీర్‌పై కూడా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. కష్టపడకుండా విజయం రాదు. విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చు. ఎన్టీఆర్, అబ్దుల్ కలామ్, ధీరూభాయ్ అంబానీ, చంద్రబాబు వంటి వారంతా ఎంతో కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. చంద్రబాబు గారు చిన్నతనంలో 6 కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేవారు. నాకు తల్లిదండ్రులే స్ఫూర్తి. మా నాన్నగారు ఎంతో కష్టపడి పైకి వచ్చారు. చిన్న వయసులో ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారు. ఆ తర్వాత స్కూల్ కి వెళ్లి చదువుకునే వారు. ఎంతోమంది తల్లిదండ్రులు స్థోమత లేకపోయినా వారి శక్తికి మించి పిల్లలను చదివిస్తున్నారు. వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని విద్యార్థులకు నారా భువనేశ్వరి సూచించారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి పెట్టాలని, క్రీడల్లో రాణించే విద్యార్థులకు సహాయం చేయటానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. కస్తూర్భా విద్యాలయానికి 20 కంప్యూటర్లు, నర్సింగ్ విద్యార్థులకు అవసరమైన పరికరాలు అందేలా ఏర్పాట్లు చేస్తామని" నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు.

**పిల్లలను విలువలతో పెంచాలి**

"విలువల బడి వ్యవస్థాపకులు లెనిల్ గారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత నేర్పించి బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ బడులను ఏర్పాటు చేయడం గొప్ప విషయం. నా చిన్నతనంలో స్కూల్లో మోరల్ సైన్స్ ఒక సబ్జెక్ట్ గా ఉండేది. ఇప్పుడు మళ్లీ పాఠశాలల్లో ఆ సబ్జెక్ట్ తీసుకొచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు నా అభినందనలు.

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు క్లోజ్ అనే బోర్డులు పెట్టడం చాలా సంతోషదాయకం. నేటి సమాజంలో విలువలు తగ్గిపోతున్నాయి. టెక్నాలజీని చెడు కోసం ఉపయోగిస్తున్నారు. పిల్లల పెంపకంలో తల్లుల పాత్ర కీలకమైంది. చిన్నతనంలోనే విలువలు, సంస్కారం నేర్పాలి. పిల్లల ఆసక్తి గమనించి అందులో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. నారా లోకేశ్ ప్రజాసేవలో బిజీగా ఉండటంతో మా మనుమడు దేవాన్ష్ చదువు, క్రీడల విషయాలు బ్రాహ్మణినే స్వయంగా చూసుకుంటుంది. అప్పట్లో చంద్రబాబు గారు రాజకీయాల్లో బిజీగా ఉండటంతో లోకేశ్ పెంపకం బాధ్యత తానే తీసుకున్నాన"ని నారా భువనేశ్వరి తెలిపారు.

# ఎకరాతో సేంద్రియ సాగు ప్రారంభించండి

మనం ఎదుగుదాం" అని పిలుపునిచ్చారు. సేంద్రియసాగును వ్యవసాయ పాఠ్యాంశాల్లో చేర్చేందుకు కృషిచేయాలని శాస్త్రవేత్తలు, పరిశోధక సంస్థలకు ప్రధాని సూచించారు. అంతకుముందు పుట్టపర్తి నుంచి కోయంబత్తూరుకు వచ్చిన ప్రధాని మోదీకి రైతుల నుంచి ఘనస్వాగతం లభించింది. కర్షకులు తమ ఆకుపచ్చ తువ్వాళ్లను గాల్లో తిప్పుతూ మోదీకి స్వాగతం పలికారు. దీన్నిచూసి 'ఈ ఉత్సాహం చూస్తుంటే నాకన్నా ముందుగానే బిహార్ గాలి ఇక్కడ వీస్తున్నట్లు కనిపిస్తోంది' అని మోదీ వ్యాఖ్యానించారు. సదస్సులో సేంద్రియ వ్యవసాయంలో ఆదర్శ రైతుల్ని జ్ఞాపికలతో ఆయన సన్మానించారు.

**బాంబు బెదిరింపు కలకలం :** కోయంబత్తూరులో బుధవారం మోదీ పర్యటనకు బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. కోయంబత్తూరు జిల్లా కలెక్టరేట్‌కు ఈ-మెయిల్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు ఈ బెదిరింపులు పంపారు. దాంతో అధికారులు అందరూ అప్రమత్తమయ్యారు. ప్రధాని పర్యటన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం బెదిరింపు బూటకమని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.




# కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

## భవన నిర్మాణ కార్మికుల ధర్నా

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)**

భవన నిర్మాణ కార్మికుల కోసం వసూలు చేసిన వేల కోట్ల రూపాయల సెస్సును ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయకుండా సూపర్ సిక్స్ వంటి కార్యక్రమాలకు మళ్లించాలనే కుట్రతో సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం రమేష్ తీవ్రంగా విమర్శించారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం కలెక్టరేట్ వద్ద బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల యూనియన్ (సిఐటియు)ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సంఘ జిల్లా అధ్యక్షులు ఎన్ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అమానుషంగా సంక్షేమ బోర్డు పథకాలను నిలిపివేసి భవన నిర్మాణ కార్మికులకు చేసిన అన్యాయాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ముందు చంద్రబాబు-పవన్ కూటమి నిలిపివేసిన అన్ని పథకాలను పునఃప్రారంభిస్తామని, ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక ఇస్తామని ఘోషించిన కూటమి ప్రభుత్వం నేడు 18 నెలలు పూర్తైనా ఒక్క మాటను నిలబెట్టుకోలేదని తీవ్రంగా విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన 1% సెస్సులో రూ.3,294 కోట్ల నిధులను కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయకుండా సూపర్ సిక్స్ పథకాలకు మళ్లించాలన్న కుట్రతోనే ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంలేదని ఆరోపించారు. గతంలో వైసిపి, తెలుగుదేశం ప్రభుత్వాలు రూ.1,800 కోట్లు ప్రభుత్వ పథకాలకు మళ్లించిన విషయాన్ని కూడా రమేష్ గుర్తు చేశారు. సంక్షేమ బోర్డు సక్రమంగా పనిచేసిన కాలంలో ప్రమాద మరణానికి రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలు, గర్భిణీ ప్రసూతి సహాయం రూ.20వేలు, కార్మికుల కూతుళ్ల పెళ్లికి రూ.20వేలు, పిల్లల విద్యకు స్కాలర్‌షిపులు వంటి పథకాలు అమలు అయ్యేవని చెప్పారు. వైయస్సార్ ప్రభుత్వం విడుదల చేసిన 1214 మెమోతో ఈ అన్నీ ఆగిపోయాయని, కూటమి ప్రభుత్వం దీనిని ఇప్పటికీ రద్దు చేయలేదని ధ్వజమెత్తారు. ఉచిత ఇసుక ఇస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చాక ఇసుక ధరలను అదుపుచేయకుండా జిల్లాలో టన్ను ఇసుకను రూ.1200కు అమ్ముకుంటూ, వాగు పరివాహక ప్రాంతాల నుండి ప్రజలు ఇసుక తెచ్చుకునేందుకు ఇసుక మాఫియా అడ్డుకట్ట వేస్తోందని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.9000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన సెస్సును వారి సంక్షేమానికే వినియోగించాలన్నారు. గతంలో మంజూరు చేసిన పథకాల లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని, ఉచిత ఇసుక హామీని అమలుచేయాలని, గృహనిర్మాణదారులు ఇసుక తెచ్చుకోవటానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఓ బి చినఓబులేసుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి రమేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు యస్ కె హుస్సేన్, యన్ శ్రీను, యస్ కె నాగూర్, బానుమూర్తి, యస్ కె సుబాని, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల పై దాడులు, నేరాలు జరిగితే యంత్రాంగం తక్షణమే స్పందించి న్యాయం చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 20)**






ఎస్సీ, ఎస్టీలపై దాడులు, నేరాలు జరిగితే యంత్రాంగం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లా స్థాయి పర్యవేక్షణ, నిఘా కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. ఎస్టీలకు అత్యాచార నిరోధక చట్టం రక్షణ వలయంగా ఉందని కలెక్టర్ అన్నారు. చట్టం పక్కాగా అమలయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న ఎస్సీ, ఎస్టీల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సంఘటనలు జరిగితే బాధితులైన వారికి న్యాయం చేయాల్సి ఉందన్నారు. జీవో 95 ఆధారంగా బాధితులకు తక్షణమే సహాయక చర్యలు అందించాలన్నారు. పరిహారం, ఉద్యోగం కల్పించడం చట్టం నిబంధనలో ఉందన్నారు. గడిచిన రెండేళ్లలో 152 కేసులలో బాధితులకు రూ.1.44 కోట్లు చెల్లించమన్నారు. 29 కేసులను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. మరో 265 కేసులు కోర్టు పరిధిలోనే పెండింగ్ లో ఉందన్నారు. గడిచిన మూడు నెలలలో మూడు కేసుల వారు రాజీపడగా, ఒక కేసులో ముద్దాయిలకు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందన్నారు. బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆ కేసులలో బాధితులు ఉద్యోగానికి అర్హులైతే వారి వివరాలను తక్షణమే సిద్ధం చేయాలన్నారు. ఇప్పటివరకు నమోదైన కేసులు వివరాలన్నీ గూగుల్ షీట్లో పొందుపరచాలని సూచించారు. పోలీసుల దర్యాప్తులో జాప్యం ఉండరాదన్నారు. బాధితులైన వారికి తక్షణమే న్యాయం చేయడం చట్టం బాధ్యతగా ఆయన వివరించారు. సఫాయి కర్మచారుల రహిత సమాజం నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు. సఫాయి కర్మచారుల జిల్లాస్థాయి నిఘా కమిటీ సమావేశం జరిగింది. ఇప్పటివరకు జిల్లాలో సఫాయి కర్మచారులు నమోదు కాలేదన్నారు. గ్రామ పంచాయతీలు, పట్టణ ప్రాంతాలలో ఆయా శాఖల ద్వారా విచారించినప్పటికీ ఆ వృత్తి మనుగడలో లేదన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం జరగాలని ఆయన సూచించారు. పంచాయితీలు, పురపాలక సంఘాల ఆర్థిక వనరులు మెరుగుపడాలని ఆయన చెప్పారు. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడితే అభివృద్ధి పనులు మరింత జరిగే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, కమిటీ కన్వీనర్ రాజదిబోరా, కమిటీ సభ్యులు బి పోతురాజు, భగవాన్ దాస్, వెంకటప్రసాద్, ఆల్ ఫ్రెడ్ రాజ్ సువి సాల్మన్, డి ఇమ్మానియేల్, యు సుధాకర్, వాటిలోని ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

4




షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం





# భూటకపు ఎన్‌కౌంటర్ల పై న్యాయ విచారణ జరిపించాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)**
కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చే న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రామరాజ్యం పేరుతో రాక్షస పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతిరోజు నక్సలైట్లను దారుణంగా కాల్చి చంపటమే పనిగా పెట్టుకున్నారన్నారు. నక్సలైట్లు వద్ద పోలీసులు ఉన్నారని, పారా మిలిటరీ దళాలు ఉన్నాయని, ఆయుధాలు ఉన్నాయనే పేరుతో కేంద్ర బలగాలు అమాయకులైన గిరిజన ప్రజలను ఎన్కౌంటర్ల పేరుతో చంపటం ఎంతవరకు సబబు అన్నారు. తాము చర్చలకు సిద్ధమని ఒక పక్కా నక్సలైట్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మానవ మారణ కాండను కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిపుత్రులను చర్చలకు పిలిసి వారి సమస్యలను చర్చించి, వాటికి పరిష్కార మార్గం చూపాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా మారణ కాండను సృష్టిస్తుందన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాలు పూర్తిస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఒక హంతక ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారన్నారు. దీనిని ప్రజలు సహించదని, ప్రజాస్వామ్యవాదులంతా దీనిని ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఎన్కౌంటర్లు ఖండించే వారిపై కూడా కేసులు ఉంటాయని,

(తరువాయి 4లో...)

# థాంక్యూ సార్..!

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జాయింట్ కలెక్టర్
### పేద వితంతువుకు ఇంటిపట్టా అందజేత
### పెన్షన్ కూడా వచ్చేలా చర్యలు
### ఆయన ఆదేశాలతో కుటుంబానికి బియ్యం
### ఇతర నిత్యావసరాలు కూడా అందజేత - కృతజ్ఞతలు తెలిపిన పేద మహిళ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)**
ఆమె పేరు మాలపాటి స్వప్న. దర్శి మండలంలోని తూర్పు వీరాయపాలెం గ్రామ నివాసి. వయస్సు 23 ఏళ్లు. ఇద్దరు బిడ్డల తల్లి. పెళ్లయిన ఐదేళ్లకే భర్త (అనిల్ బాబు)ను కోల్పోయింది. జీవనాధారం లేని తనకు ఉపాధి మార్గం చూపించి ఆదుకోవాలని ఈనెల 17వ తేదీ సోమవారం ప్రకాశం భవనంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణకు అర్జీ ఇచ్చి వేడుకొంది. ఆమె పరిస్థితిని ఆలకించిన జాయింట్ కలెక్టర్ హృదయం చలించిపోయింది. అన్ని విధాలా ఆదుకుంటామని ఆమెకు భరోసా ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు అదే రోజున దర్శి తహసిల్దార్ శ్రావణ్ కుమార్, ఇతర రెవెన్యూ అధికారులు ఆమెకు 25 కేజీల బియ్యం, రెండు కేజీల కందిపప్పు, రెండు కేజీల వంటనూనె, కొంత ఆర్థిక సహాయం అందించారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం ప్రకాశం భవనంలోని తన చాంబర్లో బాధిత మహిళలకు జాయింట్ కలెక్టర్ ఇంటి పట్టాను సైతం అందించారు. ఇల్లు కూడా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. వితంతు పెన్షన్ కూడా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరింత ఆర్థిక సాధికారత సాధించేలా జోనోపాధి కోసం నైపుణాభివృద్ధి శాఖ ద్వారా శిక్షణ కూడా ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జీవనాధారం కోల్పోయిన తనకు ప్రభుత్వం తరఫున అండగా నిలిచినందుకు జాయింట్ కలెక్టరుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# 2026 ఏప్రిల్ 1న ప్రధాన మంత్రి అవార్డు జిల్లాకు రావాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 20)**
జిల్లాలో కేంద్ర ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అములు చేసి జిల్లాకు ప్రధానమంత్రి అవార్డు వచ్చేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. గురువారం రాత్రి జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు హాల్ నందు 2026 సంవత్సరం ప్రధానమంత్రి అవార్డులకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో కేంద్ర ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అములు చేసి జిల్లా కు ప్రధానమంత్రి అవార్డు వచ్చేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. 2026 ఏప్రిల్ 1 ప్రధానమంత్రి అవార్డు అందజేయడం జరుగుతుం దన్నారు. దేశంలో 747 జిల్లాల కలెక్టర్లు ప్రధాన మంత్రి అవార్డుకు దరఖాస్తులు చేస్తారని తెలిపారు. అందులో భాగంగా ప్రధానమంత్రి అవార్డుకు జిల్లా నుండి దరఖాస్తు చేయడం జరుగుతుందని తెలిపారు. హర్ ఘర్ జల్ యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ), ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్), మిషన్ ఇంద్రధనుష్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పిఎం స్వనిధి కిసాన్ క్రెడిట్ కార్డ్ కెమ్ (రైతులు),

(తరువాయి 4లో...)




# ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 20)
మండలంలోని మనగ్రోమోర్ సెంటర్, కరేడు గ్రామంలోని ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారి డి విజయకుమార్ ఆకస్మిక తనిఖీ చేసారు. అందులో భాగంగా కొన్ని ఎరువుల శాంపిళ్లను తీసుకొని నాణ్యతా ప్రమాణాల నిర్ధారణ కొరకు ప్రయోగశాల కు పంపించడం జరిగింది. ప్రభుత్వం వారు ధ్రువీకరించిన కంపెనీలకు సంబంధించిన ఎరువులను మాత్రమే దుకాణంల నుండి రైతులకు అందించాలని, గుర్తింపు లేని కంపెనీల ఎరువులు, పురుగుమందులు విక్రయాలు జరిపినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకొనబడునని ఎరువులు పురుగు మందుల వ్యాపారస్థులను హెచ్చరించారు.

## ఖాధర్ భాష త్వరగా కోలుకోవాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)
బీజేపీ పొదిలి పట్టణ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ బాషా తీవ్ర అనారోగ్యానికి గురై ఒంగోలులోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి గురువారం ఎయిమ్స్‌కు వెళ్ళి ఖాదర్ బాషాను పరామర్శించారు. వైద్యులను అడిగి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి రావాలని ఆమె ఆకాంక్షించారు. ఒంగోలు, పొదిలి బిజెపి నాయకులు ఆమెతో కలిసి ఖాదర్ బాషాను పరామర్శించారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 100 రోజులు జైలు శిక్ష

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, నవంబర్ 20)
మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో షేక్ షరీఫ్‌కి 100 రోజులు జైలు శిక్ష, రూ.15,000 జరిమానా విధిస్తూ గిద్దలూరు ఏజెఎఫ్సిఎం కోర్టు న్యాయమూర్తి భరత్ చంద్ర గురువారం తీర్పు చెప్పినట్లు గిద్దలూరు అర్బన్ సీఐ కే సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ సురేష్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని ప్రమాదకరమని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురికావాల్సి వస్తుందని, అందువల్ల వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని హితవు పలికారు.

## 2026 ఏప్రిల్ 1న ప్రధాన మంత్రి అవార్డు జిల్లాకు రావాలి



ప్రధాన మంత్రి మాతృ అందన యోజన పిఎం విశ్వకర్మ, ప్రధాన మంత్రి పోషణ యోజన, పిఎం ముద్రా యోజన, 11 పథకాలు జిల్లాలో సంతృప్త విధానాన్ని ఊహించే మిశ్రమ పథకాలు జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు జరిగేలా సంబందిత శాఖాధికారులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, సిపిఓ ఏ ఎస్ రాజు, పిడిలు, ఐసిడిఎస్, గృహ నిర్మాణ సంస్థ రాధమాదవి, వెంకటేశ్వరరావు, గ్రామ వార్డుల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను గురువారం సచివాలయంలోని వారి కార్యాలయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మర్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దన్ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు పోతురాజు కాలవ, నల్ల వాగుల అభివృద్ధికి నిధులు మంజూరు గురించి ప్రతిపాదనలు, మెప్మాలో గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అవినీతి పైన లోతైన విజిలెన్స్ విచారణ వేయాలని, మున్సిపల్ కార్పొరేషన్‌కి రావలిసిన నిధులు సుమారు రూ.79 కోట్లు, కాంట్రాక్టర్ లకు రావలిసిన పెండింగ్ బిల్స్ మంజూరు విషయం గురించి చర్చించినట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు.

## భూటకపు ఎన్‌కౌంటర్ల పై న్యాయ విచారణ జరిపించాలి

తమ నెక్స్ట్ టార్గెట్ టు అర్బన్ నక్సలైట్లని పేర్కొనటం దుర్మార్గమన్నారు. నేడు నక్సలైట్లు, రేపు కమ్యూనిస్టులు, ఆ తర్వాత లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులపై కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడులు జరిపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు తమ గళాన్ని మరింత విప్పాలని పిలుపునిచ్చారు. బూటకపు ఎన్కౌంటర్లపై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు ఎంఏ సాలార్, తదితరులు పాల్గొన్నారు.

## కాల భైరవ స్వామి పూజలు నిర్వహించిన శిద్దా లక్ష్మి పద్మావతి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)
శ్రీ స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి ఒంగోలు వారి ప్రథమ వార్షిక మహోత్సవం ఒంగోలు మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి, ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా సూర్యప్రకాశరావు, జయశ్రీ దంపతులు హాజరై శ్రీ స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శిద్దా లక్ష్మీ పద్మావతి చే ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా కాలభైరవ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వచ్చిన ముఖ్య అతిథులకు శ్రీ స్వర్ణాకర్షణ కాలభైరవ కమిటీ సభ్యులు ఈ కాలభైరవ చిత్రపటాలను అందజేశారు. అనంతరం సుమారుగా 400 మందికి అన్న ప్రసాద వితరణ వచ్చిన ఆదిత్య అతిథులు చే లక్ష్మీ పద్మావతి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో గాయత్రి మందిర సెక్రటరీ తూనుగుంట మల్లికార్జునరావు, మందిర వైస్ ప్రెసిడెంట్ పివి శేఖర్, ఆలపాటి సీతారామయ్య, గాయత్రి మందిర కమిటీ సభ్యులు, శిద్దా వెంకట ప్రసాద్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉచిత ఇసుక మోసంపై ఉక్కు పిడికిలి

## భవన నిర్మాణ కార్మికుల గర్జన, ప్రభుత్వాన్ని హెచ్చరించిన సీఐటీయూ
## సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా
## ఉచితం అంటే రూ.700 ఇసుకను రూ.1400 చేయడమా






**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 20)**
రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల బతుకులను గాలిలో దీపం చేసిన ప్రభుత్వ విధానాలపై మార్కాపురం పట్టణంలో నేడు సీఐటీయూ ఆధ్వర్యంలో భవననిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు . కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి, "ఉచిత ఇసుక" పేరుతో నిలువు దోపిడీకి పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు పెద్ద ఎత్తున మార్కాపురం సబ్-కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

**ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక...**

ఉదయం నుండే భవన నిర్మాణ కార్మికులు ఎర్రజెండాలు చేతబూని, తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులతో సబ్-కలెక్టర్ కార్యాలయం ముందు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికుల ఆవేదన, ఆగ్రహం కట్టలు తెంచుకున్నాయి. అనంతరం సీఐటీయూ నాయకత్వంలో, కార్మికులు సబ్-కలెక్టర్ కార్యాలయం నుండి గడియార స్తంభం మీదుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

**ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం...**

ధర్నాను ఉద్దేశించి మాట్లాడిన సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు జరుగుతున్న అన్యా యాలను తీవ్రంగా ఎండగట్టారు. ముఖ్యంగా "ఉచిత ఇసుక" పేరుతో ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో రూ. 700 లకు దొరికే టన్ను ఇసుకను నేడు రూ. 1400 లకు పైగా చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇది ఉచిత ఇసుక అమలు చేయడమా? లేక కార్మి కుల కష్టాన్ని దోచుకోవడమా?" అని వారు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ విధానం వల్ల నిర్మాణ వ్యయం పెరిగి, రంగం కుదేలై, వేలాది మంది కార్మికులు పనులు కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎన్నికల సమయంలో మీరు చెప్పిన మాటలు ఇచ్చిన హామీలు మరచిపోయారా అని, గత ప్రభుత్వం మీకు మోసం చేసింది మాకు ఓటు వేసి గెలిపిస్తే దారిమళ్లిన సంక్షేమ బోర్డు నిధులు మళ్ళీ బోర్డులో జమ చేయడమే కాకుండా అదనంగా కోటి రూపాయలు సొంతగా మీ బోర్డులో జమచేస్తాను అన్న ఉప ముఖ్యమంత్రి జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ మాటలు ఏమయ్యాయి అని నిలదీశారు. అలాగే ఎన్నికలలో గెలిచిన రాజకీయ నాయకులు కార్మికుల ఓట్ల వలనే మేము గెలిచాము అని చెప్పుకుంటున్నారు గాని ఇచ్చిన హామీ అమలు చేయాలి అనే సంగతి మరచిపోయారా అంటూ నిలదీశారు. ఇచ్చిన హామీ నెరవేర్చని గత ప్రభుత్వం గతి ఏమైందో గుర్తుంచుకోవాలని, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయకపోతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలు చేయడమే కాకుండా రోబోయే రోజులలో ఓటు ద్వారా కార్మికులు మీకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



**సంక్షేమ బోర్డుపై నిర్లక్ష్యం దారుణం....** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తోందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలు పూర్తిగా ఆగిపోయిందని, ప్రమాదాల్లో గాయపడిన వారికి, మరణించిన వారి కుటుంబాలకు అందాల్సిన ఆర్థిక సాయం, పతకాలు సైతం నెలల తరబడి నిలిచిపోయాయని మండిపడ్డారు. కార్యక్రమం చివర్లో, సబ్-కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన నాయకులు, తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని. ఈ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో, రాబోయే రోజుల్లో రాష్ట్ర స్థాయిలో భారీ ఎత్తున ఉద్యమాలు చేపట్టి, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజల్లో ఎండగడతామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమం మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గం రాజకీయ వర్గాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో చర్చనీయాంశమవుతుందా లేదా అనేది వేచిచూడాలి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు, వివిధ మండలాల భవననిర్మాణ కార్మికులు, కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 20)**
పట్టణంలోని చింతలపాలెం ఎస్ సి కాలనిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, డిసిపియు, ఎస్ఎస్ఎ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు బాలాజీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం, ప్రపంచ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఈ రోజు 1989లో బాలల హక్కుల సదస్సును అసెంబ్లీ ఆమోదించిన రోజును సూచిస్తుందని తెలిపారు. బాలల హక్కుల ఒప్పందమైన హింస నుండి రక్షించడానికి, జీవించే హక్కు, ఆరోగ్యం, విద్య, ఆటలు, అనేక బాలల హక్కులను నిర్దేశిస్తుందని తెలిపారు. ఇదే రోజున అంతర్జాతీయ బాలల దినోత్సవంగా కూడా జరుపుకుంటారని తెలిపారు. బాలల దినోత్సవం ఒక పండుగ కాదని, ఇది పిల్లల హక్కులు, విద్యా, ఆరోగ్యం, సమాన అవకాశాల పై అవగాహన పెంచే రోజు అని అన్నారు. సిడిపిఓ సరోజిని, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సమాజం పట్ల బాధ్యత పెంపొందించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకుని వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బాదుల్లా ఆటపాటలతో పిల్లలను అలరింపజేశారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ సుమతి, అంగన్వాడీ టీచర్స్,ఆశా కార్యకర్తలు,బాలల ప్రతినిధి సంజయ్, ఉపాధ్యాయులు బాదుల్ల, మీనాక్షమ్మ, జ్యోతి దేవి, జ్యోతి, గుడ్ హెల్ప్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఇసుక విధానం పై ధర్నాకి బయలుదేరిన కంభం మండల కార్మికులు

## సంక్షేమబోర్డు పథకాలు సాధించడం మాహక్కు
## గౌరవ అధ్యక్షులు సయ్యద్ కొత్తూరు

**(షణ్ముఖ వెలుగు, కంభం, నవంబర్ 20)**





రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిందని కంభం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. గురువారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనడానికి కార్మిక సంఘం అధ్యక్షులు బాల్లారపు రోశయ్య, ప్రధాన కార్యదర్శి షేక్. ఖాజావలి ఆధ్వర్యంలో కంభం మండలం నుండి భవననిర్మాణ కార్మికులు మార్కాపురం సబ్-కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరారు. ఇందులో భాగంగా కార్మికసంఘం నాయకులు, ప్రకాశంజిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. అన్వర్ బాషా మాట్లాడుతూ,

సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపుపై ఉచిత ఇసుక అమలు విధానంపై తీవ్రంగా మండిపడ్డారు. కార్మికులు చెమటోడ్చి కట్టిన సెస్సుతో కూడిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించింది. కార్మికుల హక్కులైన ఆ నిధులను మళ్లించడం ఏంటి? ఇది కార్మికుల ఉసురు పోసుకోవడమే. మళ్లించిన నిధులు వెంటనే తిరిగి సంక్షేమ బోర్డు ఖాతాలో జమ చేయాలి అని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఎన్నో తీపి వాగ్దానాలు చేసింది. వాటిని నిలబెట్టుకోకుండా, ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసింది. దీనివల్ల వేలాది మంది కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారు. ఇది దారుణం కాదా అని ప్రశ్నించారు.

ఉచిత ఇసుక అంటే టన్ను రూ.700 ఉన్న ఇసుకను రూ.1500 చేయడమా, ఒక ట్రాక్టర్ మట్టి రూ.500 ఉన్న దానిని రూ.1100 చేయడమా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మీకు గుర్తులేకపోతే మేము గుర్తుచేస్తాం అంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం కోసం ఎన్నికల సమయంలో మీకు గత ప్రభుత్వం కార్మికులకు మోసం చేసిందని మేము అధికారంలోకి వస్తే అందరికి ఇసుక ఉచితంగా ఇస్తాము అని అంతేకాకుండా దారిమళ్ళిన సంక్షేమబోర్డు నిధులు జమచేసి సంక్షేమబోర్డు పతకాలు కార్మికులకు అందిస్తాము అన్న సంగతి మరిచారా అని ప్రశ్నించారు. అంతేకాకుండా జనసేన అధ్యక్షులు ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇంకా ముందుకు వెళ్లి దారిమళ్లిన మీ సంక్షేమబోర్డు నిధులు సంక్షేమబోర్డులో జమచేయడమే కాకుండా కోటిరూపాయలు అదనంగా సంక్షేమబోర్డులో జమచేస్తాను అన్న సంగతి మరిచారా అని రాష్ట్రప్రభుత్వ ఉప ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలు (వివాహ బహుమతులు, ప్రమాద బీమా, పింఛన్లు వంటివి) వెంటనే కార్మికులకు అందించాలి. దారి మళ్లించిన సంక్షేమ నిధులు తిరిగి బోర్డులో జమ చేయాలి. ఈ డిమాండ్లను వెంటనే నెరవేర్చకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రెండు రోజులు తీర భద్రతా వ్యాయామం





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)**
జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు, మెరైన్ పోలీసులు సంయుక్తంగా బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సముద్రతీర భద్రతను పరీక్షించడం, ఉగ్రవాద దాడుల సమయంలో భద్రతా వ్యవస్థల ప్రతిస్పందన సామర్థ్యాన్ని అంచనా వేయడం లక్ష్యంగా సాగర్ కవాచ్ పేరిట రెండు రోజుల పాటు తీర భద్రతా వ్యాయామాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా సముద్రతీర ప్రాంతంలో మొత్తం 112 మంది పోలీస్ సిబ్బంది, అధికారులు, మెరైన్ పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్‌గా ఉన్నారు. ఉగ్రవాద కదలికలకు సంబంధించి సమాచారం సేకరించడం, సముద్ర మార్గంలో చొరబాట్లను అడ్డుకోవడం, అనుమానాస్పద వస్తువులను గుర్తించడం, మరియు చొరబాటుదారులను విచారించడం వంటి కీలక దశల్లో ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. పోలీసు బృందాలు ఈ మాక్ డ్రిల్‌లో భాగంగా రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో పటిష్ట బందబస్తును నిర్వహిస్తూ, వాహన తనిఖీలు కూడా నిర్వహిస్తున్నారు. నవంబర్ 20, 21 తేదీల్లో జరిగే ఈ మాక్ డ్రిల్‌లో ఉగ్రవాదులుగా వ్యవహరించే బృందం తీరప్రాంతంలోకి చొరబడే ప్రయత్నం చేస్తే, వారిని సమర్థవంతంగా అడ్డుకోవాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు.





## రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

### మర్రివేముల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టిన రైతులు



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, నవంబర్ 20)

మండలంలోని మర్రివేముల గ్రామంలో రైతులు గురువారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టి తమ సమస్యలను బహిర్గతం చేశారు. ఆందోళనలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయం కష్టాల్లో ఉండకూడదనే ఉద్దేశంతో పగటి పూట 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ మర్రివేముల గ్రామంలో మాత్రం అధికారులు ఈ ఆదేశాలను పాటించడం లేదని చెప్పారు. రైతులకు సమయానికి, సరిపడే ఒత్తిడితో విద్యుత్ ఇవ్వకపోవడంతో పంటల సాగు తీవ్రంగా దెబ్బతింటోందని, బావులు, మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాల్సిన విద్యుత్ అధి కారులు నిర్లక్ష్యం వల్లే రైతులు అనవసర సమస్యలు ఎదుర్కొంటున్నారని రైతులు ఆరోపించారు. విద్యుత్ సరఫరా లోపాల వలన పంట కాలం నష్టపోక ముందే సమస్యను పరిష్కరించాలని, గ్రామానికి తక్షణమే స్థిరమైన విద్యుత్ సరఫరా అందించాలని వారు డిమాండ్ చేశారు. అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు వెనుకాడబోమన్నారు. రైతుల ఆందోళనతో సబ్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో అధికారులు అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. గ్రామానికి వెంటనే క్రమబద్ధమైన విద్యుత్ ఇవ్వాలని రైతులు కోరుతూ ఆందోళన కొనసాగించారు.

## లింగారెడ్డిపల్లిలో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 20)

బాలల హక్కుల వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా" ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం"ను కనిగిరి మండలం లింగారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం వి ఎస్. పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. సూపర్వైజర్ పార్వతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలలకు రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని అవి విద్యా, రక్షణ, జీవించే హక్కు, అభివృద్ధి, భాగస్వామ్యం గుర్తింపు హక్కు, వ్యక్తీకరణ, వివక్షత లేని హక్కు, బాల్యవివాహాల నిర్మూలన హక్కు, బాల కార్మిక నిర్మూలన హక్కు, సురక్షితమైన వాతావరణం, సమానత్వ హక్కు, అభిప్రాయం తెలిపే హక్కు మొదలైన హక్కులను గూర్చి తెలియజేశారు. మీరు నిర్భయంగా పాఠశాలకు వచ్చి చదువుకోవాలని, మీ హక్కులకు ఎలాంటి భంగం కలిగించినా 1098కి ఫోన్ చేయాలని, బాలల హక్కుల చట్టం 2005ను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి కోటిరెడ్డి, స్కూల్ అసిస్టెంట్ జె అశోక్ కుమార్ అంగన్వాడి కార్యకర్త సరస్వతి, సహాయకురాలు భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో చేరే విద్యార్థుల ఎంపిక





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)

ఒంగోలు నగర పరిధిలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహములు యందు 2025-2026 సంవత్సరం విద్యార్థుల యొక్క సెలక్షన్స్ అడ్వైసర్ కమిటీ చైర్మన్ ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో 10 వసతి గృహాల్లో కొత్తగా చేరిన విద్యార్థుల సెలక్షన్స్ జరిగినవి. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి టి లింగయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ హాస్టల్ పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు మంచి భోజనం టైం కి అందించాల్సిందిగా హాస్టల్ వార్డెన్‌కు సూచనలు అందించారు.

# నారాచీ హత్య కేసులో హతుడు వెంకట్రావు కుమారుడికి ఉద్యోగం

### భార్యకు ఎస్సీ, ఎస్టీ మంత్లీ పెన్షన్ దళిత హక్కుల నేత నీలం నాగేంద్ర సమక్షంలో ఉత్తర్వులు ఇచ్చిన జిల్లా కలెక్టర్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)

ఒంగోలు శివారు నారాచి రెస్టారెంట్లో 2023లో జరిగిన మాల కులస్తుడు మొలతోటి వెంకటరావు హత్య కేసులో, హతుడి కుమారుడు నరహరికి ప్రభుత్వ ఉద్యోగం, భార్య మాధవికి ఎస్సీ, ఎస్టీ మంత్లీ పెన్షన్ ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ రాజా బాబు దళిత హక్కులనేత నీలం నాగేంద్రరావు సమక్షంలో బాధితులకు అందజేశారు. గురువారం ఒంగోలు ప్రకాశం భవనంలోని కలెక్టర్ ఛాంబర్ లో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో, బాధితులతో పాటు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ నాయకులు చప్పిడి వెంగళరావు, మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ, దళిత నాయకులు కాకుమాను రవిలు కలెక్టర్ రాజాబాబును కలిశారు. కలెక్టర్ నుంచి ఉత్తర్వులు తీసుకున్న అనంతరం నీలం నాగేంద్రరావు మొలతోటి హతుడు వెంకట్రావు హత్య కేసు పూర్వాపరాలను మీడియాకు వివరించారు. నాగులుప్పలపాడు మండలం చదలవాడ సమీపంలోని కేసినేని వారి పొలెంకు చెందిన మొలతోటి వెంకట్రావు బేల్దారి పనులు చేసేవాడన్నారు. కుటుంబ గొడవల్లో భార్య మీద అలిగి, ఒంగోలు కలెక్టరేట్ పక్కన ఉన్న నిరాశ్రయుల మధ్య జీవించాడన్నారు. బాపట్ల చాకలి పాలేనికి చెందిన షేక్ సుభాని వెంకట్రావుకు కలెక్టరేట్ వద్ద పరిచయం అయ్యాడన్నారు. 2023 ఆగస్టులో పెళ్లూరు సమీపంలోని నారాచి రెస్టారెంట్లో వంట పాత్రలు దొంగతనం చేశారనే అనుమానంతో, రెస్టారెంట్ నిర్వాహకులు సిబ్బంది వెంకటరావు, సుభానిలను తీవ్రంగా కొట్టారన్నారు. వెంకట్రావు మరణించడంతో, శవాన్ని చిల్ల చెట్లలో విసిరివేశారన్నారు. వెంకట్రావు పక్కన ఉన్న సుభాని మీద వెంకట్రావు హత్య కేసు బనాయించాలని చూశారన్నారు. దొంగ సొమ్ము పంచుకునే క్రమంలో గొడవపడి పరస్పరం కొట్టుకున్నారని, ఈ గొడవలో వెంకట్రావు మరణించాడని ఖాకీ కథ అల్లారన్నారు. సాక్ష్యాలను మాయం చేశారన్నారు. హైదరాబాదులో ఉన్న తాను, హత్య విషయం తెలిసి, బాధితులకు అండగా మాల మహానాడుతో పాటు ఇతర కుల సంఘాల నాయకులను రిమ్స్ వద్దకు పంపించానన్నారు. తాను కూడా పోలీసు అధికారులతో మాట్లాడానన్నారు. వెంటనే బయలుదేరి ఒంగోలు వచ్చి బాధితులకు అండగా నిలిచానన్నారు. తాను



జోక్యం చేసుకోకుండా ఉంటే, పోలీసులు సుభానిపై తప్పుడు కేసు పెట్టి, అప్పటి అధికార వైసిపి పార్టీ నాయకులతో సన్నిహిత సంబంధాలున్న నారాచి యాజమాన్యాన్ని కాపాడేవారన్నారు. తాను జోక్యం చేసుకోవడం వల్ల, సుభాని సాక్షి అయ్యాడని, లేదంటే ముద్దాయి అయ్యేవాడన్నారు. ఒరిస్సా, బీహార్ కు చెందిన సిబ్బందితో పాటు, స్థానికులు కూడా హత్య కేసులో నిందితులుగా సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా గుర్తించారన్నారు. దళితులపై దాడులు హత్యలు సర్వసాధారణమని, అవి జరిగినప్పుడు దళిత సంఘాలు అలర్ట్ గా లేకపోతే కేసు తలకిందులు అవుతుందనేందుకు తోటి వెంకటరావు కేసే కేసు స్టడీ అన్నారు.

2024లో హతుడు వెంకటరావు భార్య మాధవికి పూర్వపు కలెక్టర్ తమీం అన్సారియా చేతుల మీదుగా 8 లక్షల 25 వేల రూపాయల రిలీఫ్ ఇప్పించానన్నారు. వెంకట్రావు కుమారుడు నరహరి మైనర్ కావడంతో పాటు, నాగులుప్పలపాడు తహసిల్దార్ నిర్లక్ష్యం కారణంగా రిపోర్టు ఆలస్యమైందన్నారు. మొలతోటి నరహరికి ప్రభుత్వ ఉద్యోగం, మొలతోటి మాధవికి జీవితాంతం ప్రతినెలా డిఎతో కూడిన 5 వేల రూపాయల ఎస్సీ ఎస్టీ స్పెషల్ మంత్లీ పెన్షన్, ఇంటి స్థలము, వ్యవసాయ భూమి మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన జిల్లా కలెక్టర్ రాజా బాబుకు నీలం నాగేంద్రరావు తో పాటు ఇతర సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. ఎస్సీ ఎస్టీ హత్య, బలవన్మరణం కేసుల్లో, ఇంటి స్థలం, వ్యవసాయ భూమి ఇవ్వాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో తహసీల్దారులు సహకరించడం లేదన్నారు. జిల్లాలో తొలిసారిగా కలెక్టర్ తమీం అన్సారియా ద్వారా చీమకుర్తి దేవరకొండ రత్తమ్మ హత్య కేసులో ఇంటి స్థలం మంజూరు చేయించానని, ఇప్పుడు మొలతోటి వెంకటరావు హత్య కేసులో కూడా ఇంటి స్థలం, వ్యవసాయ భూమి మంజూరు చేయించానన్నారు.

# మెడికల్ విద్యలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)

ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం చేస్తుందని, అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అటువంటి చర్యలను వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడియస్ యూ రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపులో భాగంగా.. ఈరోజు ఒంగోలు నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి నూతనంగా 17 మెడికల్ కళాశాలలను కేటాయించిందని, గత ప్రభుత్వ హయాములో ఐదు పూర్తి చేసి తరగతులు జరుగుతుండగా, నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మిగిలిన కళాశాలలను పూర్తి చేసి, తరగతులు నిర్వహించాల్సి ఉండగా ఈ కళాశాలలో మేము నిర్వహించలేమని, ప్రభుత్వ-ప్రైవేటు-భాగస్వామ్యం -ద్వారా నిర్వహించాలని మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం దారుణం అన్నారు.. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు.. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జీవన్ నెంబర్ 107,108,590 లను రద్దుచేసి అర్హులైన ప్రతి విద్యార్థి మెడిసిన్ చదివే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అమరావతి, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో వందల వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్తున్న ప్రభుత్వానికి రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అభివృద్ధి చేయడానికి నిధులు లేవా అని ప్రశ్నించారు? విద్య, వైద్య రంగాలను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని భారత రాజ్యాంగంలో రాసుకున్నప్పటికీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంస్థలను ప్రైవేటీకరించడానికి కుతూహలాడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు అన్నారు.. భారతదేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీక రిస్తున్నారని, అందులో భాగంగా వైద్య, విద్యారంగాన్ని ప్రైవేటీ కరించ, ఆదానీ,అంబానీ చేతుల్లో పెట్టడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయని ఇటువంటి ప్రయత్నాలు వెనక్కి తీసుకోవాలని లేదంటే రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సిసింద్రీ బాబు, నాయకులు . వి.కోటి, సిహెచ్,సాంసన్, చంద్రశేఖర్, సచిన్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం పై ప్రభుత్వం ప్రాధాన్యత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)

ప్రజా సమస్యల పరిష్కారం పై రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా పలువురు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక దరఖాస్తుదారులకు స్వయంగా ఫోన్ చేసి సమస్య పరిష్కార విధానం, సంతృప్తి చెందారా, లేదా అన్న విషయాన్ని తెలుసుకోవడం జరిగింది. అలాగే సంబంధిత అధికారులతో కూడా మాట్లాడి ఏ విధంగా సమస్యను పరిష్కరించారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ సంబంధిత ధరఖాస్తుదారులు సంతృప్తి చెందారా లేదా ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా తెలుసుకోవడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# పేదల సొంతింటి కల నిజం చేస్తున్నాం



## ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు అందించిన ఎమ్మెల్యే
## కందుకూరు అర్బన్ పరిధిలో 417 ఇళ్లు మంజూరు
## రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక
## అనుభవజ్ఞుడు చంద్రబాబు పాలనలో అంతా మంచే జరుగుతోంది
## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 20)**

పేదల సొంతింటి కలలు నిజం చేయటంలో భాగంగా, కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇళ్లు మంజూరు చేస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు అర్బన్ పరిధిలో 417 మందికి ప్రభుత్వం తరపున ఇళ్లు మంజూరు కాగా, అందుకు సంబంధించిన సాంక్షన్ ఉత్తర్వులను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని బృందావనం, కోటారెడ్డి నగర్ 1,2 సచివాలయాల పరిధిలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ కే. అనూష, హౌసింగ్ ఈఈ మాధవరావు, డి ఈ నారాయణ, తహసిల్దార్ లావణ్యతో కలిసి లబ్ధిదారులకు అనుమతి పత్రాలు అందించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో పేదల కోసం టిడ్కో ఇళ్లను కట్టించిన సంగతిని గుర్తు చేశారు. కందుకూరు పట్టణంలో 1400 కుటుంబాలు, టిడ్కో ఇళ్లల్లో కాపురం ఉంటున్నారని చెప్పారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం కనీసం 10% పనులు పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఊరికి దూరంగా వాగులు, వంకల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వైసిపి హయాంలో నిర్మించిన కాలనీ ఇళ్లకు బిల్లులు మధ్యలో ఆపేసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని, సొంత స్థలాలు ఉండి ఇల్లు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఏవైనా సమస్యలు ఉంటే, వారికి అన్యాయం జరగకుండా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సొంతగా స్థలాలు లేని వారికి పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు చొప్పున ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అవసరమైతే ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు ఇస్తామని నాగేశ్వరరావు తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత చంద్రబాబు నాయుడు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలా వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ.ఈ ఇంటూరి సుబ్బారావు పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విద్యాశాఖ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, ఉప్పుటూరి శ్రీనివాస్ రావు, కంద్రా మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, కల్లూరి శైలజ, మహర్షి శ్రీను, చనమాల శ్రీధర్, గేరా నరేష్, దాసరి ప్రమోద్, శ్యామ్ పాలేటి కోటేశ్వరరావు, వడ్డెళ్ళ రవిచంద్ర, బెజవాడ ప్రసాద్, గడ్డం మాలకొండయ్య, కూనం నరేంద్ర ముచ్చు వేణు, గుమ్మా శివ, వలేటి వెంకటేశ్వర్లు, వడ్లమూడి చెంచు నారాయణ, యోగేశ్వరరావు, మంచిరాజు మురళి, మేడ మల్లికార్జున, చుండూరి శ్రీను, సవిడిబోయిన వెంకటకృష్ణ, అత్తోట మాల్యాద్రి, మురారి శెట్టి వెంకట సుధీర్, కొత్తూరు వెంకట సుధాకర్, షేక్ రూబీ, జియావుద్దీన్, కొచ్చర్ల తనూజ్ కుమార్, పరుసు నాగేశ్వరరావు, నగర జయకృష్ణ అన్ని వార్డు అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నేతలు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.





# దివ్యాంగులలో మార్పు తేవడమే లక్ష్యం



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, నవంబర్ 20)**

మానసిక, శారీరక దివ్యాంగులలో మార్పు తెచ్చి వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యమని ఫిజియోథెరపీ వైద్యులు షేక్ మహబూబ్ పీర్ అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గల భవిత కేంద్రంలో గురువారం 18 సంవత్సరాల లోపు దివ్యాంగులకు ఆయన వివిధ చికిత్సలు నిర్వహించారు. ఈ చికిత్సల గురించి ఆయన తెలియజేస్తూ ఫిజియో థెరపీకి సంబంధించిన అన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందజేస్తున్నామని. కొంతమంది చిన్నారులు పలు రకాల లోపాలతో జన్మిస్తారనీ వారిలో మెడ నిలబడకపోవడం, కూర్చోలేకపోవడం, కాళ్ళు వంకరగా ఉండటం ఇలా అనేక రకాల సమస్యలకు చికిత్సలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని బద్వేలు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఐఈఆర్‌పి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి మంగళవారం నిర్వహించబడుతుందని, ఈ మంగళవారం ఒక ప్రత్యేక కార్యక్రమం ఉండటంతో దానిని గురువారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. చికిత్సలు అందించేందుకు భవిత కేంద్రంలో అన్ని పరికరాలు ఉన్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పి లక్ష్మీబాయి, పలువురు దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు








**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 20)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజీ లో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. ఈ తరహా జాబ్ మేళాలు విద్యార్థులకు, నిరుద్యోగులకు గొప్ప అవకాశం ప్రతీ యొక్క యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు. అలానే కంపెనీ ప్రతినిధుల వీలు ఆయన ఎక్కువ మందికి ఉద్యోగాలు ఇవ్వాలని సూచించారు. ఈ జాబ్ మేళా కు 10 కంపెనీస్ కి సంబంధించిన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తంగా 157 మంది నిరుద్యోగ యువతి యువకులు పాల్గొనగా వారిలో 74 మంది ఉద్యోగాలకు సెలెక్ట్ అయ్యారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళ్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె రమాదేవి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జి శ్రీధర్ నాయుడు, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ జే రవితేజ, సిబ్బంది విజయకుమారి, నందన్ బాబు, కూటమి ప్రభుత్వం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కండ్లేరు చెరువు ఎడమ కాలువ లీకేజీ పై తక్షణమే చర్యలు తీసుకోవాలి





**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, నవంబర్ 20)**

మండలానికి జీవనాడిగ నిలిచే చిన్నకండ్లేరు చెరువు ఎడమ కాలువలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న లీకేజీ రైతుల్లో తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తోంది. చెరువుల్లో నీరు నిల్వ ఉండాల్సిన సమయంలో రోజుల తరబడి లీకేజీ కారణంగా నీటిమట్టం పడిపోతోందని, చెరువు కట్ట బలహీనపడే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి బృందం గురువారం పర్యటించి పరిశీలనలో గుర్తించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ పురోగమనం పేరుతో ఏ ప్రభుత్వం వచ్చినా చెరువుల పరిరక్షణపై సరైన దృష్టి పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో చెరువు కట్టకు గండి పడినప్పుడు అప్పటి మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ కొంతపాటి పూడ్చే పనులు చేపట్టినప్పటికీ అవి ఫలితం ఇవ్వకపోవడంతో లీకేజీ సమస్య యథాతథంగా కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బాధ్యతలో ఉన్న నేపథ్యంలో వెంటనే జోక్యం చేసుకుని చెరువు కట్టను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువు కట్ట బలహీనత కొనసాగితే కింది తెల్లగట్లతో పాటు పరిసర గ్రామాలు ప్రమాదంలో పడే అవకాశముండటంతో రైతులు గండిపడే భయంతో రాత్రింబవళ్లు ఆందోళన చెందుతున్నట్లు ప్రతినిధి బృందం వెల్లడించింది. టీ%-%5 కాలువకు అనుబంధంగా ఉన్న ఈ చెరువు ఒక టీఎంసీ సామర్థ్యం కలిగి ఉండగా, భూగర్భ జలాల పెరుగుదలకు ప్రధాన ఆధారంగా నిలుస్తుందని, దాదాపు 2500 ఎకరాలకు సాగునీరు మరియు 5000 బోర్లకు ఈ చెరువు జీవనాధారమని ఆయన గుర్తుచేశారు. నీరు ఇలా వృథా అవుతుండగా అధికారులు, ప్రజాప్రతినిధులు చలనం లేకపోవడం బాధాకరమని, మరికొద్ది రోజులు ఇలా కొనసాగితే రాబోయే వ్యవసాయ కాలం సంక్షోభంలో పడుతుందని రైతులు పేర్కొన్నారు. చెరువులో ఇప్పటికే రెండు అడుగుల మేర నీరు బయటకు వెళ్లిపోయినట్లు రైతులు తెలిపారు. ఈ విషయం మీద మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఇరిగేషన్ శాఖ అధికారులను రైతు సంఘం ఇప్పటికే అప్రమత్తం చేసినట్లు తెలిపారు. చెరువు కట్టకు శాశ్వత పునరుద్ధరణ పనులకు ఒక కోటి 40 లక్షల ప్రతిపాదనను ప్రభుత్వం వద్దకు పంపినట్టు, అలాగే ఎష్టిఎ కింద 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఇరిగేషన్ విభాగం ఫోన్ ద్వారా తెలిపిందని రైతుసంఘం నాయకులు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ వారు తక్షణ చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు, ధర్నాలు తప్పవని, రైతు సంఘం మిగతా సంఘాలతో కలిసి ఉద్యమానికి సిద్ధమవుతామని నాయకులు హెచ్చరించారు. చెరువును కాపాడుకోవడం ఈ ఆయకట్టు కింద ఉన్న ప్రతి రైతు బాధ్యతగా వారు పిలుపునిచ్చారు.



## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు







**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, నవంబర్ 20)**
58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం ముగింపు సమావేశం ఏర్పాటు చేసారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 14.11.2025 నుండి 20.11.2025 వరకు మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ పోటీలు, చిత్రలేఖనము, వ్యాసరచన ముగ్గుల పోటీలు ,క్విజ్ పోటీ పాటల పోటీలు, మ్యూజికల్ చైర్స్ ఆటలు స్కిప్పింగ్ ఆటలు, దస్టర్ ఆటలు నిర్వహించారు. ఈ పోటీలకు సుమారుగా 95 మంది బహుమతులను పొందారు. గురువారం ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా తర్లుపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ముతోజు సుధాకర్, చెన్నారెడ్డిపల్లి ప్రధానోపాధ్యాయులు బాలరాజు, మండల పరిషత్ హిందూ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి రాహేలు అమ్మ, విశ్వ స్పందన స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, చెన్నారెడ్డిపల్లి ఉపాధ్యాయులు పి కోటి మోహన్, మీర్జాపేట ఉపాధ్యాయులు సంజీవ్ కుమార్, తుమ్మలచెరువు ఉపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, ఎర్రయ్య, జిల్లా పరిషత్ కర్లపాడు నుండి గోసు శ్రీనివాస్, ప్రదీప్ కుమార్, పాల్గొని ఈ కార్యక్రమం నిర్వహించారు. మొదటగా ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేశారు. అనంతరం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గురించి విద్యార్థినీ, విద్యార్థులకు వచ్చిన ఉపాధ్యాయులందరూ వివరించడం జరిగింది. తదుపరి పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమాలన్ని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చు

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి,**

**జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్ ఏ భారతి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)**
న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వలన ఇరు వర్గాలు గెలిచినట్టే భావించబడతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి , జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్ ఏ భారతి అన్నారు. గురువారం విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో ఆమె తెలిపారు. డిసెంబర్ 13 వ తేదీ జరగబోయే జాతీయ లోక్ అదాలత్ నందు ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదులు సహకరించాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న వ్యాజ్యాలకు కోర్టు ఫీజు తిరిగి ఇవ్వటం జరుగుతుందని అదే విధంగా లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, కక్షిదారులందరూ గమనించాలని తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ప్రకాశం జిల్లాలోని అన్ని న్యాయస్థానాలలో ప్రత్యేక బెంచీలు ఏర్పాటు ద్వారా సత్వరము సమస్య పరిష్కారానికి ఏర్పాట్లు చేస్తున్నామని ప్రీ సిట్టింగ్స్ రూపంలో వ్యాజ్యాలను ముందే పరిష్కరించుకోవచ్చని 13 వ తేదీ సంబంధిత అవార్డుని పొందవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని సమయం, ధనం ఆదా చేసుకోవాలని తెలియజేశారు.

# పుస్తకం జ్ఞానాన్ని పెంపొందిస్తోంది వారంలో ఒక్క రోజైనా గ్రంథాలయాన్ని సందర్శించాలి

### విద్యార్థులకు సూచించిన జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)**
ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలు నందు 58వ జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవ వేడుకలలో చివరి రోజు ముగింపు వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వారు విద్యార్థినీ, విద్యార్థులకు కొన్ని సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా చినిగిన చొక్కా అయినా వేసుకో కానీ ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కో అని సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం చెప్పారన్నారు. అనగా పుస్తకం జ్ఞానాన్ని పెంపొందిస్తుంది అని అర్థమన్నారు. వారంలో ఒక్కరోజు అయినా గ్రంథాలయాన్ని సందర్శించి మీరు ఏదో ఒక ఆక్టివిటీని అలవర్చుకొని అది పేపర్ చదవడం, డ్రాయింగ్ వేయడం మొదలగునవి ఆక్టివిటీలో పాల్గొని మీ జ్ఞానాన్ని పెంపొందించుకొనవల్సిందిగా సూచించారు. సెల్‌ఫోన్ కు దూరంగా ఉండి వార్తా పత్రికలను, పుస్తకాలను చదవడం అలాగే మీ కలలను డెవలప్ చేసుకోవాలని, మీకు నచ్చిన కళలు సంగీతం, నృత్యం, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి వాటిని మెరుగుపరుచుకుని ఒక్క చదువుకే ప్రాధాన్యత ఇవ్వకుండా కళలను కూడా ప్రోత్సహిస్తూ ముందుకు వెళుతూ మీ గమ్యాన్ని మీరు చేరుకోవాల్సిందిగా సూచించారు. ఈ వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నందుకు విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు. వారం రోజుల పాటు జరిగిన పోటీలలో విజేతలుగా పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవి శివారెడ్డి, ఇన్చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కె సంపూర్ణమ్మ, సందీప్ అనిల్, శివకుమారి, గోవిందమ్మ, కార్యాలయ సిబ్బంది సాంసన్, కృష్ణవేణి, మృదుల్ కుమార్, గ్రంథాలయ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరికలు కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో చేరిక



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 20)**
ప్రకాశం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 20 మంది గురువారం భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెల్స్ కో - కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ప్రకాశం జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మాకినేని అమరసింహం ఆధ్వర్యంలో వారంతా పార్టీలో చేరారు. గుత్తి శ్రీధర్, జీ శివ కృష్ణ, వాసుదేవ్, కిషోర్ కుమార్ తో సహా మరో 20 మందికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ప్రధాని మోడీ, ఎన్డీయే ప్రభుత్వంలో జరుగుతున్న ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో, జిల్లాలో బీజేపీ నాయకులు చేస్తున్న కృషి గురించి కమ్మిశెట్టి లక్ష్మి, నగేశ్ బాబు ద్వారా తెలుసుకుని, ఆకర్షితులై పార్టీలో చేరినట్లు 20 మంది కార్యకర్తలు తెలియజేశారు. ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో వికసిత భారత్ లక్ష్యంగా దేశం ప్రగతి పథంలో నడుతస్తోందని, రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ గారు సైతం బీజేపీ గురించి ఏపీ ప్రజలకు తెలిసేలా చేస్తున్న అనేక కార్యక్రమాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమంది భారతీయ జనతా పార్టీవైపు ఆకర్షితులవుతున్నారని ఈసందర్భంగా నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉండే పార్టీ బీజేపీ అని ఆయన అన్నారు. ఒకేసారి ఇంతమంది పార్టీలో చేరడం ఆనందంగా ఉందని పార్టీ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు చెప్పార. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాయపాటి అజయ్, జిల్లా మాజీ అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, బీజేపీ నాయకులు సత్యవతి, దండు శ్రీనివాస్, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ గోపిదేశీ వెంకటేశ్వర్లకు నివాళులర్పించిన ఎరిక్షన్ బాబు



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 20)**
యర్రగొండపాలెం పట్టణంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ గోపిదేశీ వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సందర్శించి వారికి పూలమాలతో నివాళులు అర్పించాడు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించాడు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల వెంగల్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేగినాటి శ్రీను, సర్పంచ్ మంత్ర నాయక్, కాకర్ల కోటయ్య, శనగ నారాయణరెడ్డి, పలువురు నాయకులు వెంకటేశ్వర్లు భౌతికాయాన్ని పూలమాలలతో సందర్శించి నివాళులర్పించారు.

# టిడిపి రాష్ట్ర బీసీ సెల్ సీనియర్ నాయకుడు, మాజీ కార్యదర్శి బొప్పరాజు వెంకటయ్య కన్నుమూత

### నివాళులర్పించిన మండలటిడిపి నాయకులు

### బుధవారం బొప్పరాజును పరామర్శించిన ఎమ్మెల్యే కందుల







**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, నవంబర్ 20)**
తెలుగుదేశంపార్టీ అభిమానిగా, సానుభూతిపరుడుగా ఉంటూ బిసి సంఘాల తరఫున ఎనలేని కృషిచేసి పార్టీ అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా ఆయనతో పాటు వారి కుటుంబీకులు కూడా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న విషయం పాఠకులకు విధితమే. బొప్పరాజు వెంకటయ్య స్వగ్రామం తర్లుపాడులోని మీర్జాపేట. ఈయన మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తూ గ్రామవాసులకు సూపరిచుతుడు. విద్యార్థులకు మంచి గురువుగా, మంచి పేరు ప్రతిష్టలు సంపాదించారు. దీంతో ఈయన ఉద్యోగ విరమణ తర్వాత తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడుగా పనిచేశారు. ఈయన నీతి, నిజాయితీ, మంచి వాక్యాతుర్యం కలిగిన వక్త కావడంతో అధిష్టానం గుర్తించి ఈయనను రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమించారు. ఈయన వయసు 88 సంవత్సరాలు. ఈయనకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. ఈయన రిటైర్డ్ అయిన తర్వాత నుండి తెలుగుదేశం పార్టీకి వీరాభిమానిగా ఉంటూ ఎనలేని సేవలు చేశాడు. బీసీ సంఘాలలో మంచి పట్టున్న వ్యక్తి. ఈయన గతంలో శ్రీశైలం రజక నిత్య అన్నదాన సత్రం సెక్రటరీగా, వెలుగొండ వెంకటేశ్వరస్వామి రజక సత్రానికి కోశాధికారిగా విధులు నిర్వహించి మంచితనానికి మారు పేరుగా నిలిచారు. ఈయన అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన మరణానికి ముందు రోజు మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరామర్శించడం కూడా జరిగింది. అకస్మాత్తుగా గురువారం ఆయన పరమపదించారు. ఈయన మృతదేహానికి తర్లుపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపరెడ్డి తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గోపీనాథ్ చౌదరి, మండల మాజీ కన్వీనర్ వి జాన్, కూచిపూడి రోశప్ప నాయుడు, గొలమారి శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, నంబుల లక్ష్మయ్య, ఈర్ల వెంకటయ్య, కందుల చిట్టిబాబు, గుర్రపుశాల నరసింహారావు, పెసల వెంకటేశ్వర్లు, ఆర్ గురువయ్య, టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com